''కథలు రాస్తున్నావా? లేదా? రాయ్. ఒక్కొక్క వ్యక్తి జీవిత చరిత్రలు పరిశీలిస్తే ఖరీదైన అనుభవాలూ, అద్భుతమైన ఇతివృత్తాలూ ఉంటాయి. వెతుక్కో'' అన్నారు మా గురువుగారు. ఆ సలహా నాకిచ్చి సన్యాసం పుచ్చుకొని కంచికి వెళ్లిపోయారాయన.

# జీవిత చరిత్రలు

కథ

ఇక్కడే ఇబ్బంది వచ్చింది. ఏ వ్యక్తి దగ్గరకు వెళ్లి అతడి జీవిత చరిత్ర అడగనూ. అడిగితే నాకు చెబుతాడా. ఇక నాకు తెలిసింది నా జీవిత చరిత్ర ఒకటే. కాని నా జీవితం నాకే అర్థమయి చావదు. అప్పుడేది రాసినా అంతా సిరా కంపు అంటారు.

ఈ పట్టణాల్లో లాభంలేదు. మా జిల్లాలోనే ఓ మారు మూల గ్రామంలో నా క్లోజ్ ఫ్రెండు ఉన్నాడు. ఊరి పేరు నిమ్మలపాడు. వాడి పేరు వీరభద్రం. వ్యవసాయం వెలగబెడుతున్నాడు. వాడి ఊరు వెళ్లి, వాడింట్లో పుడ్డే కొన్నాళ్లు తిని వాడి లైఫే కథగా రాసేస్తాను. ఇదీ నా ప్లాను.

యమర్జెంటుగా నిమ్మలపాడు గ్రామానికి బయలుదేరాను. బస్సు దిగాక మూడు కిలోమీటర్లు మట్టిరోడ్డు. కాళ్లీడ్చుకుంటూ నడిచాను.

వీరభద్రం ఇంట్లోనే ఉన్నాడు.

నన్ను చూడగానే ఫేసులో హేపీ ఎక్స్‌ప్రెషన్. ''రా గురూ. మారిపోయావు గురూ'' అన్నాడు.

''మనం కలిసి చాలా ఏళ్లు అయింది కదా. నాలో మార్పులు వచ్చుంటాయి'' అన్నాను.

''అది కాదు. నువ్విన్నాళ్లూ ఎందుకు కనబడలేదు'' అన్నాడు.

''నువ్వెప్పుడూ మావూరు రాలేదు కాబట్టి'' అన్నాను.

''నేను రాలేదు సరే. నువ్వెందుకు మా ఊరు రాలేదు?'' అన్నాడు.

''ఇప్పుడొచ్చానుగా.''

''అది కాదు. ఇన్నాళ్లూ ఎందుకు రాలేదూ?''

''కొన్నాళ్లూ రావాలనిపించలేదు''

''అదే ఎందుకు రావాలనిపించలేదూ?''

వెధవ చొప్పదంటు ప్రశ్నలు. నాకొళ్ళు మండింది. ''మళ్లీ ఆ ప్రశ్న అడిగితే నిన్ను చిదగ్గొట్టేసి ఇప్పుడే వెళ్లిపోతాను'' అన్నాను.

దాంతో దారికి వచ్చేడు. ఇంట్లోకి రానిచ్చేడు.

అదీ ఇదీ మాట్లాడేము. మధ్యలో కథల గురించి అడిగేడు. ''కథలెలా బరుకుతున్నావ్? సమాజాన్ని సర్ఫ్ పౌడరెట్టి కడిగేసినట్టు బరుకుతున్నావా? ఎప్పుడూ పెన్ను బాగా రాయడం లేదనేవాడివి. తెల్లకాగితాలు లేవనేవాడివి. ఇప్పుడు కూడా తెల్లకాగితాలు ముష్టెత్తుకొంటున్నావా. బెగ్గింగ్ వైట్ పేపర్సు. గ్రేట్ ముష్టి. అదిసరే. నీ దగ్గర ఉన్న పెన్ను నీదేనా? ఎవరిదైనా కొట్టేసావా?''

''నాదే'' అన్నాను.

''అబ్బా! సొంత పెన్ను కూడా మెయిన్‌టయిన్ చేస్తున్నావన్నమాట'' అని కాసేపాగేడు. తర్వాత నావైపు తీక్షణంగా చూస్తూ-

''నిజం చెప్పు. నా దగ్గరకు ఎందుకు వచ్చావు?'' అన్నాడు.

''నీ ఆత్మకథ రాద్దామని.''

పటాసుకాయ పేలినట్టు నవ్వాడు. '' నా ఆత్మకథ ఎందుకూ! అంతా సూపర్ ఫాస్పేటు కంపు''

''అంతా సూపరేనా! నువ్వు పుట్టడం ఎక్కడ? 'కౌడంగు'లో పుట్టలేదా?'' అన్నాను.

మళ్లీ పటాసుకాయ పేలింది.

''నువ్వంతగా నవ్వకు. నీ జీవితంలోని పేడ సువాసనలు వెదజల్లు'' అన్నాను.

''పేడ సువాసనలు మా తాతగారి కాలంలో. ఇప్పుడవి లేవు'' అన్నాడు.

''పోనీ..మీ తాతగారి జీవిత చరిత్ర..లైఫ్ స్టోరీ..నీకు తెలిసింది...చెప్పు'' అన్నాను భుజం గట్టిగా పట్టుకొని.

''చెబుతాను. అంతగా కుదిపేకు..ఆ..ఒక ఇన్సిడెంటు గుర్తొచ్చింది'' అన్నాడు.

''మరి చెప్పు'' అన్నాను.

వాడు కాసేపు ఆలోచించుకొని చెప్పాడు ''అవి మా తాతగారి కాలంనాటి రోజులు''

''గుడ్ ఓల్డెన్ డేస్ అన్నమాట'' అన్నాను.

''మధ్యలో నువ్వు అడ్డురాకు..ఒకసారి మహాకవి గురజాడవారు మా నిమ్మలపాడు గ్రామానికి ఏదో రాచకార్యం మీద గుర్రబ్బండీలో వచ్చారు''

''గుర్రబ్బండీలోనా..అంతే కౌబాయ్‌లాగా అన్నమాట.''

''అదే. నిన్ను అడ్డురావద్దని చెప్పానా..ఆ గురజాడ వారిని చూడటానికి గ్రామమంతా తరలివచ్చింది. గ్రేట్ పోయట్ కదా..ఏదీ ఆ గీతం..దేశమంటే మట్టికాదోయ్..దేశమంటే మనుషులోయ్..''

''తర్వాతేమయిందో చెప్పు. పొయట్రీ వద్దు'' అన్నాను.

''ఆ మహాకవిని మా ఊర్లో ఘనంగా గౌరవించారు. ఆ సందర్భంలో మా తాతగారు గురజాడ వారిమీద నాలుగు వాక్యాల కవిత్వం చెప్పారు.''

''మీ తాతగారు కవా!''

''కాదు. కానీ కవిత్వం చెప్పారు. ఆశు కవిత్వం అంటారు కదా..అలా సహజంగా ఉట్టిపడింది. గురజాడ వారు ఆయన్ని చాలా మెచ్చుకొన్నారు. తర్వాత ఆ గుర్రబ్బండీలోనే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఊర్లో జనాలు కూడా మా తాతగారిని చాలా మెచ్చుకొన్నారు. గురజాడ దేశానికి మహాకవి అయితే తాతగారు నిమ్మలపాడు గ్రామానికి మహాకవి అని కీర్తించారు. కాని అక్కడితో ఈ స్టోరీకి 'ది ఎండ్' పడలేదు.

మర్నాటి నుండీ తాతగారికి ఊర్లో హోదా పెరిగింది.

ఆయన్ని చూసి ఆయన 'ఫుట్ ప్రింట్స్'లో నడవాలని కొందరు కవిత్వం చెప్పడం మొదలెట్టారు. తాతగారు వాళ్లని ప్రోత్సహిస్తూ 'నువ్వీ గ్రామానికి నెంబరు టూ మహాకవి' అంటూ ఒక్కొక్కరినీ మెచ్చుకోసాగేరు. మరి 'నెంబరువన్' ఆయనే కదా. అలా నెంబరు టూలు చాలామంది తయారయ్యారు.

ఒక్కక్షణం ఊపిరి పీల్చుకొన్నారు. తర్వాత తాతగారు 'సడెన్లీ డెడ్'.

నిమ్మలపాడు గ్రామానికి నెంబరువన్ పోస్టు ఖాళీ. అంతే. ఆ పోస్టు కోసం నెంబరు టూలంతా విజృంభించి కొట్టుకొన్నారు.''

''ఎవరు గెలిచారు?'' అడిగాను.

''ఎవరూ గెలవలేదు. అందరికీ దెబ్బలు తగిలాయి. ఇప్పటికీ ఆ పోస్టు ఖాళీ.''

''అయిపోయిందా?''

''అయిపోయింది'' అన్నాడు.

నేను చెప్పాను. ''నాకు నీ వంశవృక్షం స్టోరీస్ వద్దు. అవన్నీ అవుట్ డేటెడ్ బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లా.''

వాడు బుర్ర గోక్కున్నాడు. ''పోనీ నీకు అర్జంటుగా పైకి ఎదిగిన వ్యక్తిని చూపించనా?'' అన్నాడు.

''చూపించు. అతడి జీవిత చరిత్ర రాస్తాను'' అన్నాను.

''అయితే నాతో రా. నీకు కేశవరావుని పరిచయం చేస్తాను'' అంటూ దారితీసాడు.

''ఆగు కేశవరావు ఎవరు?'' అడిగాను.

వాడు చెప్పాడు ''ఎప్పటికీ ఆగని తారాజువ్వ. పైకి అలా వెళ్తూనే ఉంటాడు.''

రెండు కిలోమీటర్ల దూరం అడ్డుదారి అట. పొలాలగట్ల మీదుగా నడిపించాడు.

మరో ఊరు చేరాము. పెద్ద విలేజీ అన్నమాట. ఊర్లో రెండు సినిమా హాళ్లు ఉన్నాయి. అంటే ఊరి సైజుని అర్థం చేసుకోవచ్చు. ఒక సినిమా హాలు దగ్గర ఆగాం. వీరభద్రం నన్ను ఆ హాల్లోని ఆఫీస్ రూముకు తీసుకువెళ్లాడు.

రూములో సెంటువాసన వస్తూంది. అది ఎదురుగా టేబులు ముందు కూర్చున్న వ్యక్తి చొక్కామీదనుండి. ''రా భద్రం..రా..కూర్చో'' అన్నాడా వ్యక్తి.

మేమిద్దరం అతడి ఎదురుగా కూర్చున్నాము.

''సెంటు ఫారిన్‌ది. వాసన బాగుంది కదూ'' అన్నాడు.

''చాలా బాగుంది'' అన్నాడు వీరభద్రం.

నల్లటి మీసాలూ, నల్లటి శరీరం, తెల్లటి షర్టూ, తెల్ల

పంచల చాపూ, వ్రేళ్లకు నాలుగేసి ఉంగరాలూ, రిమ్‌లెస్ కళ్లద్దాలతో ఆ వ్యక్తి ఆకర్షణీయంగా ఉన్నాడు.

మావాడు ఆ వ్యక్తికి నన్ను పరిచయం చేసాడు. ''ఈయనో రైటరు. కథలూ అవీ బాగా రాస్తాడు.''

''పాపం!'' అన్నాడు కేశవరావు కళ్లద్దాలలో నుండి ఓరగా చూస్తూ.

''నీ జీవిత చరిత్ర రాయడానికి వచ్చాడు'' అన్నాడు వీరభద్రం.

కేశవరావు నన్ను పరీక్షగా చూసాడు. ''జీవితంలో అంతగా పైకి రాలేనివాళ్లు పైకి వచ్చిన గొప్పవాళ్ల జీవిత చరిత్రలూ, అసలు పైకి రాలేనివాళ్ల దీనబ్రతుకులూ కథలుగా రాస్తారు. అవునా?'' అన్నాడు.


''అవునవున్నార్'' అన్నాను.

వీరభద్రాన్ని చూసి ఆయన అన్నాడు. ''నా జీవిత చరిత్ర నీకు తెలియనిదేముంది. హిస్టరీ అంతా చెప్పే. రాసుకొంటారు''

''అలాగే'' బోలెడు విధేయత. అంత ప్యూను టైపు మావాడు.

తర్వాత ఆయన మా ఇద్దరికీ 'టీ'లు తెప్పించాడు.

అవి తాగి బయటికి వచ్చాము.



మ్యాటినీ షో ప్రారంభం కాబోతుంది. క్యూలో స్థానం కోసం జనం కుమ్ములాట.

''ఏమిటీ యన హిస్టరీ!'' అడిగాను.

వీరభద్రం చెప్పసాగేడు.

''కొన్నేళ్ల క్రిందట కేశవరావు ఈ ఊరు వచ్చేసరికి గర్భదరిద్రుడు. అలా ఆరోడ్డు వైపు చూడూ. అక్కడో కిళ్లీబడ్డీ ఉంది. ఆ బడ్డీ ప్రక్కనే పకోడీలు వేసుకొంటూ అమ్మేవాడు. తర్వాత ఇడ్లీ, పూరీ, మినపట్టుతో రోడ్డు ప్రక్కన పూరిపాకలో హోటలు నడిపేవాడు. కొన్నాళ్లు గడిచేసరికి ఆ హోటలు బిల్డింగ్‌లోకి మారింది. మరి కొన్నాళ్లు కేశవరావు మోటారు రంగంలోకి దూకాడు. ఒక లారీ కొన్నాడు. లోను మీదే. రోజులు బాగున్నాయి. మళ్లీ మరో లారీ...ఈలోగా ఈ స్థలం కొన్నాడు. సినిమా హాలు కట్టించాడు. హాలు ముందర షాపింగు కాంప్లెక్సు కట్టించి అద్దెకు ఇచ్చాడు. హాలు చుట్టూ హౌసింగు కాలనీ కట్టించాడు. అక్కడితో ఆగలేదు. మళ్లీ లారీ..మళ్లీ లారీ..ఇపుడు పాతిక లారీల దాకా ఉన్నాయి. మంచి జీడితోట కూడ ఉంది. పెద్ద బిజినెస్ మాగ్నెట్ అయిపోయాడు. అంతే నాకు తెలుసు.''

''లైఫ్‌లో పైకి రావడం ఇంత వెరీ సింపులా?'' అన్నాన్నేను.

''అవును. అదే అయింది''

''మరి నువ్వెందుకు అలా పైకి రాలేదు!'' అడిగాను.

''నాకు పకోడీలు చెయ్యడం రాదు'' అన్నాడు.

''అవెందుకూ చెయ్యడం''

''మరి కేశవరావు పకోడీల తోటే స్టార్టు అయాడుగా'' అన్నాడు.

ఎదురుగా రోడ్డు మీద పకోడీలు చేసి అమ్ముకొంటూన్న మరో వ్యక్తి కనుపించాడు. ''ఆ పకోడీల ఆసామీ కూడా ప్యూచర్‌లో పెద్ద బిజినెస్ మాగ్నేట్ అవుతాడా?'' అడిగాను.

''ఏమో నాకు తెలీదు. అతడ్ని అడుగుదాం పద'' అన్నాడు వీరభద్రం.

మేమడిగిన కొచ్చెనుకు పకోడీలవాడు విషాదపు నవ్వు. ఏక్టరుగా రాణించి ఉండేవాడు. ''జగమే మాయ'' అన్నాడు.

''అలాగా'' అన్నాడు వీరభద్రం.

''బాబూ! ఈ ప్రక్కనే ఉన్న పెద్ద హోటలు ఒకప్పుడు నాదే. జీవితంలో ఇంకా పైకి వద్దామని ఒక లారీ లోను మీద కొన్నాను. బేడ్‌లక్, రోజులు బాగోలేవు. రాయపూరుకు లోడుకు నాలుగు వేలిచ్చేవారు. బండి తిరిగొచ్చేసరికి రిపేరుకు ఆరువేలయేది. దీనికి తోడు లోను రీపేమెంట్లు. వాయిదాలు చెల్లించకపోయేసరికి ఫైనాన్సు కంపెనీవాళ్లు లారీ పట్టుకుపోతామన్నారు. కాని నేను లారీ బిజినెస్సు వదులుకోదలుచుకోలేదు. హోటలు అమ్మేసి లోను తీర్చాను. మళ్లీ రోజులు కలిసిరాలేదు. లారీని మరి నడపలేకపోయాను. దాన్ని దాని డ్రైవరుకే అమ్మేసాను. అతడు దాన్ని నడుపుకొంటూ నా డబ్బు ఇన్‌స్టాల్‌మెంట్లతో తీరుస్తాడు...నిన్నటి డ్రయివరు నేటి ఓనరు..హు..'' అన్నాడు.

''దున్నేవాడిదే భూమిలాగ తోలేవాడిదే బండయింది..'' అన్నాడు వీరభద్రం.

అతడి దగ్గర పకోడీలు కొన్నాము. అవి తింటూ ఇంటికి తిరిగొచ్చాము.

''బండ్లు ఓడలగుటయూ, ఓడలు బండ్లగుటయూ నిజమయింది'' అన్నాను.

''నువ్వు చెప్పింది పూర్తిగా నిజం కాదు. ఒకసారి బాగా పైకి పోయినవాడు ఎప్పుడూ పైనే ఉంటాడు. ఎటొచ్చీ మధ్యతరగతి సంసారాలకే ఈ ట్రూత్ అప్లికబుల్. కాకపోతే ఈ సామెత కొంచెం సవరించుకోవాల్సి ఉంటుంది. అదేమిటంటే-పెద్ద ఓడలు ఎప్పుడూ పెద్ద ఓడలుగానే ఉండును. చిన్న ఓడలు బండ్లు అగును. బండ్లు చిన్న ఓడలు అగును'' అన్నాడు వీరభద్రం.

**డా. బి.ఎస్.ఎన్. మూర్తి**